క్లుప్తంగా

7న బీజేపీ జిల్లా సదస్సు

ఒంగోలు సబర్బన్: బీజేపీ జిల్లా సదస్సును ఈ నెల 7వ తేదీ నిర్వహించనున్నట్లు రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఒంగోలులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దినకర్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ జరిగే సదస్సుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వస్తున్నారన్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి యానం చినయోగయ్య యాదవ్, మాజీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాకినేని అమరసింహ, అశోక్ రెడ్డి, నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు రాయపాటి అజయ్, మంచాల ప్రసాదరావు, ఆషా రావు, శ్రీనివాసులురెడ్డి,నాగేశ్వరరావు, శివాజీ యాదవ్, రవి యాదవ్, బొద్దులూరి ఆంజనేయులు, కాటా రాధాకృష్ణమూర్తి, రాజేశ్ వర్మ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్న మిత్ర బృందం

ఒంగోలు మెట్రో: ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర బ్రాహ్మణ సేవా సమితి శుభప్రద కమ్యూనిటీ భవనంలో మహంకాళి వెంకట శేషయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. లయన్స్ క్లబ్, గుడ్ గవర్నెన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ ఆర్ఎంపీ డాక్టర్ హనుమంతరావు, కొల్లా వెంకయ్యలను మహంకాళి వెంకటశేషయ్య, వారి మిత్ర బృందం ఘనంగా సత్కరించారు. ముందుగా స్నేహితులందరూ ఒకచోట కలిసి వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ రంగనాథం, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ కంచర్ల సుబ్బారావు, ఓరుగంటి ప్రసాద్, రిటైర్డ్ టీచర్ సముద్రాల సుబ్రహ్మణ్యం, ప్రముఖ వ్యాపారవేత్త తాతా శ్రీనివాసులు, గుంజి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం


జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని మంగమూరు సమీపంలో కొప్పోలు మేజర్ వద్ద జంగిల్ క్లియరెన్సు పూడికతీత పనులను ఆదివారం ఇరిగేషన్ జిల్లా ఎస్ఈ డి.వరలక్ష్మి ప్రారంభించారు. ఈ పనులకు 10.25 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. జిల్లాకు 9.63 కోట్లు మంజూరవగా, అద్దంకి, చీమకుర్తి, దర్శి డివిజన్ల పరిధిలోని సాగర్ కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, పూడకతీత పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు కె.బాపయ్య, ప్రియదర్శిని, సబ్ డివిజన్ జేఈలు అనూష, సుస్మిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్య తీర్చకపోగా కొత్త సమస్యలు.!

- విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే దామచర్లకు బండారుపాలెం వాసుల విజ్ఞప్తి
- ఆ సమస్య పరిష్కరించకపోగా, విద్యుత్ స్తంభం తెచ్చి రోడ్డు మధ్యలో వదిలేయడంతో కొత్త సమస్యలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు


బండారుపాలెంలోని సన్నటి రోడ్డు మధ్యలో వదిలేసిన విద్యుత్ స్తంభం

ఒంగోలు సబర్బన్: విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆ శాఖకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కాకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒంగోలులో జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనంగా ఉంది. నగరంలోని బండ్లమిట్ట సెంటర్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ సెంటర్‌లోని బండారుపాలెం రోడ్డులో విద్యుత్ సమస్య ఉందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆ సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అయితే, విద్యుత్ అధికారులు ఒక విద్యుత్ స్తంభం తెచ్చి ఆ రోడ్డులో పడేశారు. 20 రోజులుగా ఆ స్తంభాన్ని అక్కడే వదిలేశారు. దీంతో ఆ ప్రాంతంలో కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. విద్యుత్ స్తంభాన్ని రోడ్డుకు ఒక మార్జిన్‌లో కాకుండా రోడ్డు మధ్యలో పడేశారు. అసలే చిన్న రోడ్డు కావడంతో ఆపటు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఎవరో ఒకరికి ఆ స్తంభం తగిలి ప్రమాదాలు జరిగి గాయాలవుతున్నాయి. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఒక విద్యార్థినికి ఆ స్తంభం పక్కనే ఆపి ఉన్న మరో వాహనం తగిలి కాలి నరం కట్ అయింది. ప్రస్తుతం ఆ విద్యార్థిని కాలికి కట్టు కట్టించుకుని ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. స్తంభం తీసుకొచ్చి అక్కడ పడేసి దాదాపు 20 రోజులవుతోందని, ఎంతోమంది ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. నగరంలో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో ఇన్ని రోజుల పాటు విద్యుత్ స్తంభాన్ని వదిలేయడమంటే.. ఒంగోలు నగర విద్యుత్ శాఖాధికారులు ఎంత నిర్లక్ష్యంతో ఉన్నారో అర్థమవుతోంది.

స్తంభం విషయాన్ని ఎమ్మెల్యేకి చెప్పినా ఫలితం శూన్యం...

రోడ్డు మధ్యలో అడ్డంగా పడేసిన విద్యుత్ స్తంభం విషయాన్ని కూడా పలుమార్లు ఎమ్మెల్యే జనార్దన్ దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. కానీ, ఎలాంటి ఉపయోగం లేదని వాపోతున్నారు. ఈరోజు.. రేపు.. ఎల్లుండి అని చెబుతున్న విద్యుత్ అధికారులు ఆ స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య పరిష్కరించడంగానీ, దాన్ని అక్కడి నుంచి తొలగించడం కానీ చేయడం లేదని మండిపడుతున్నారు. రాత్రి సమయంలో స్తంభం తగిలి అనేకమంది కిందపడి గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈని అడిగితే.. కాంట్రాక్టర్ వద్ద మనుషులు లేరని చెబుతున్నారని స్థానికులు తెలిపారు. తొందరపెడితే స్తంభాన్ని తీసుకెళ్లిపోతామని అంటున్నారని, స్తంభాన్ని నిలబెట్టడానికి లేని మనుషులు.. ఆ స్తంభాన్ని తీసుకెళ్లడానికి ఎక్కడి నుంచి వస్తారో అర్థం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపై వదిలేసిన కరెంటు స్తంభాన్ని ఏర్పాటు చేస్తే బండారుపాలెంలోని వీధిలో కరెంటు సమస్య ఉండదని అంటున్నారు. అలా కాకుండా రోడ్డు మధ్యలో పడేసి ప్రజలను ఇబ్బందిపెట్టడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ట్రంకు రోడ్డు వ్యాపారులకు అండగా వైఎస్సార్ సీపీ

- పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు


మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: ట్రంకు రోడ్డు వ్యాపారులు, ఆర్యవైశ్య సామాజికవర్గం వారి ప్రయోజనాల కోసం వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. ఆదివారం ఒంగోలు నగరంలోని 26వ డివిజన్‌లో బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టోపై క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని ట్రంకు రోడ్డు విస్తరణ గురించి చుండూరి రవిబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు స్వచ్ఛందంగా 70 అడుగుల మేరకు ఇవ్వడానికి సిద్ధపడ్డారని, ఆ మేరకే స్థలాన్ని సేకరించాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రభుత్వం సేకరిస్తున్న స్థలానికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ట్రంకు రోడ్డు వ్యాపారస్తులకు వైఎస్సార్ సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు తమ పార్టీ నిర్ణయాన్ని స్పష్టంగా ప్రకటించినట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే వైఎస్సార్ సీపీ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని, పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. దాని వల్ల ప్రజల వద్ద డబ్బులు లేక వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో షాపులను కూల్చివేయడం వల్ల ట్రంకు రోడ్డులో వ్యాపారాలు మరింత దెబ్బతినే అవకాశాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారస్తులు గత ప్రభుత్వ పాలనా విధానాన్ని బేరీజు వేసుకుని వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నాయకులు పాలడుగు రాజీవ్, మహిళా నాయకులు అప్సరా బేగం, ప్రసన్న, మేరీ, వాణి, భాస్కర్, డివిజన్ అధ్యక్షులు కరుణాకర్, దేవా, శ్రీకాంత్, యోహాన్, పీటర్, 26వ డివిజన్ నూతన అధ్యక్షుడు దేవనబోయిన మణికంఠ శ్రీనివాసులు, వేమూరి శ్రీనివాసులు, రావులపల్లి ప్రేమ్ కుమార్, తుమ్మలపల్లి మహేష్, పూలబోయిన మహేష్, చిట్టిబోయిన వంశీ, దేవనబోయిన శ్రీరాములు, తుమ్మలపల్లి నిఖిల్, ఆకుల రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టోపై క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న చుండూరి రవిబాబు, నాయకులు

వైఎస్సార్ సీపీ నాయకునికి బూచేపల్లి పరామర్శ


పెద వెంకారెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

చీమకుర్తి రూరల్: మండలంలోని పాటిమీదపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కిష్టపాటి పెద వెంకారెడ్డిని ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. పాటిమీదపాలెం గ్రామంలోని పెద వెంకారెడ్డి ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. బూచేపల్లి వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్ రెడ్డి, కూడలి మాలకొండయ్య, మూలె రమణారెడ్డి, కిష్టపాటి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నయన మనోహరంగా సీతారాముల పరిణయం


సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, దంపతులు

ఒంగోలు మెట్రో: నగరంలోని గుర్రంవారివీధిలో సీతారామస్వామి మందిర పంచమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామ మందిర జీర్ణోద్ధరణ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల మూలవిరాట్లకు ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు, పూజ క్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. దేవస్థాన ఆవరణలో చూడచక్కని కళ్యాణ వేదిక ఏర్పాటు చేసి సీతారామలక్ష్మణులను ఒకవైపు, ఆంజనేయస్వామి, పరివార దేవతలను మరొకవైపు కొలువుదీర్చి భక్తుల హర్షధ్వానాల నడుమ రాములోరి కళ్యాణోత్సవాన్ని నేత్రోత్సవంగా నిర్వహించారు. అర్చకులు, రుత్విక బృందం ముందుగా దేవేరులకు కంకణధారులను చేసి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. శుభముహూర్తాన స్వామివారు, అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం ఉంచి కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ, మాల మార్పిడిని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ భజన మండలి మహిళలచే కోలాట నృత్య ప్రదర్శన నయన మనోహరంగా సాగింది. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని లోకాభిరాముని కల్యాణాన్ని తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా శీతలాంబదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


చండీ హోమంలో పాల్గొన్న దంపతులు

ఒంగోలు మెట్రో: స్థానిక ప్రగతికాలనీలో శీతలాంబదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. యాగశాల ఏర్పాటు చేసి గణపతి పూజ, మండపారాధన, మహామృత్యుంజయ జపం, ఆయుష్యసూక్త పారాయణ, కృష్ణ యజుర్వేద పారాయణ, నవగ్రహ నక్షత్ర హోమాలు, చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మండప పూనఃపూజ, అవబృద స్నానము, నూతన వస్త్రధారణ, దంపతి పూజ, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పూర్ణాహుతిలో పాల్గొన్న మహిళా భక్తులు

వైఎస్సార్ సీపీ నాయకుని తల్లికి నివాళులు


రత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుగు సుబ్బారావు తల్లి రత్తమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మాదాల వెంకట్రావు, నాయకులు మాచవరం వెంకట్రావు, పెరుగు సుబ్బారావు, పెరుగు కృష్ణ, బస్సు మస్తాన్, నల్లగట్ల రామాంజనేయులు, వై.గణేష్, కె.మహేష్ తదితరులు పాల్గొని రత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

చప్టాలపై రక్షణ కరువు


చినరావిపాడు - మర్రిపాలెం మధ్యలో కాలువపై ఉన్న చప్టాకు రక్షణ గోడ లేని దృశ్యం


తొర్రగుడిపాడు - ఎర్రగుడిపాడు మధ్యలో ముదిగొండ వాగుపై ప్రమాదకరంగా ఉన్న చప్టా

చీమకుర్తి రూరల్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న చప్టాలకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తొర్రగుడిపాడు – ఎర్రగుడిపాడు మధ్యలోని ముదిగొండ వాగుపై ఉన్న చప్టాలకు రక్షణ గోడలు లేకపోవడంతో పాటు ప్రమాదకర మలుపు ఉండటంతో గతంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. అదేవిధంగా చినరావిపాడు – మర్రిపాలెం మధ్యలో కాలువపై చప్టాకు రక్షణ గోడ లేకపోవడం వలన రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలో ఇటువంటి ప్రమాదకర చప్టాలు చాలా ఉన్నాయని, వాటిపై కూటమి ప్రభుత్వం, పాలకులు, అధికారులు దృష్టి సారించి ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం వైపు రైతుల చూపు

- పత్తి, మిరప సాగుతో నష్టాలు
- అరటి, మొక్కజొన్న, బొప్పాయి సాగుకు మొగ్గు


పీవీపల్లిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

పుల్లలచెరువు: పుల్లలచెరువు మండలంలోని పలు గ్రామాల్లో నల్లరేగడి, ఎర్రనేల భూములు ఎక్కువగా ఉన్నాయి. దీంతో రైతులు ఏడాదిగా ఎక్కువగా పత్తి, మిరప పంటలు సాగు చేసి మంచి దిగుబడులు సాధించారు. ప్రస్తుతం వాటికి గిట్టుబాటు ధరలు లేకపోవడం, తెగుళ్ల బెడద పెరగడంతో రైతుల ఆలోచన మారింది. ఐదారేళ్లుగా పత్తికి గులాబీ పురుగు వ్యాప్తి చెంది దెబ్బతీసింది. మిరపలో జెమినీ వైరస్, నల్లనల్లి వ్యాప్తి చెంది పంటలను తొలగించే పరిస్థితి ఏర్పడింది. దీంతో అన్నదాతలు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. కాలువ, నీరు ఉన్న ప్రాంతాల్లో వరి పంట సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మెట్ట, కొందరు రైతులు మొక్కజొన్న, బొప్పాయి, అరటి, సజ్జ పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

చాలా గ్రామాల్లో రైతులు గతంలో వేసిన పంటలకు భిన్నంగా పంటలను మార్చేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అరటి, మొక్కజొన్న, బొప్పాయి పంటలు సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. పుల్లలచెరువు మండలంలో మొక్కజొన్న 130 హెక్టార్లు, కంది 12, బొప్పాయి 100, అరటి 20 హెక్టార్లలో ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్నారు. కంది సాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.


వెంకటరెడ్డిపల్లిలో సాగు చేసిన అరటి తోట

కూలీల కొరతతో ఇబ్బందులు

నాకు 15 ఎకరాల పొలం ఉంది. గతంలో మిర్చి, పత్తి పంటలు సాగు చేశాను. పత్తిలో గులాబీ పురుగు, మిర్చిలో తెగుళ్లతో పెట్టుబడి పెరిగింది. కొన్ని సందర్భాల్లో గిట్టుబాటు ధర లేదు. మిరప కోతల సమయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అందుకే చాలా వరకు వ్యవసాయం తగ్గించి పది ఎకరాల్లో బొప్పాయి, అరటి పంటలు సాగు చేస్తున్నా. అధికారులు గ్రామాల్లో పర్యటించి తగు సూచనలు ఇస్తే వ్యాపార పంటల సాగు చేసే విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– కొత్త చిన్నా, రైతు, పుల్లలచెరువు

కంది 5, సజ్జ 5 ఎకరాలు సాగు చేస్తున్నా

మాది నల్లరేగడిపాలెం. గతంలో పత్తి, మిరప పంటలను ఎక్కువ సాగు చేశాను. తెగుళ్లు, గిట్టుబాటు ధరలు లేక నష్టాలు రావడంతో పెట్టుబడులు కూడా రావడం లేదు. దీంతో ఖరీఫ్‌లో కంది, సజ్జ పంటలు సాగు చేయాలని నిర్ణయించుకున్నా.

– వెంకటేశ్వరరెడ్డి, గంగవరం.

ఏసోబుకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

దర్శి: గుండె ఆపరేషన్ చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మండలంలోని తూర్పుచౌటపాలెం గ్రామానికి చెందిన ఏసోబుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో రూ.5000 సాయం చేశారు. దాతల సహకారంతో వచ్చిన మరో రూ.22 వేలు కలిపి మొత్తం రూ.27 వేలను ఆదివారం అందజేశారు. వారికి ఏసోబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, వైస్ చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు సీహెచ్ బసవయ్య, ప్రధాన కార్యదర్శి జీ వేణు, ట్రెజరర్ తిరుపతిరెడ్డి, గౌరవాధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, హెల్త్ మెంబర్ సుశీల, సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వరరెడ్డి, వెంకటరావు, సుధాకర్‌రావు, కరుణానిధి, తదితరులు పాల్గొన్నారు.